క్లుప్తంగా

అమర్‌నాథ్ యాత్రికులకు ఉస్మానియాలో వైద్య పరీక్షలు

అఫ్జల్‌గంజ్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పర్యవేక్షణలో ముగ్గురు వైద్యులకు ఈ బాధ్యతలు అప్పగించారు. సోమ, గురువారాల్లో డాక్టర్ కేఎంకే రెడ్డి (కార్డియాలజీ) ఆధ్వర్యంలో అవుట్ పేషంట్ బ్లాకులోని రూమ్ నంబర్ 208 వద్ద, మంగళ, శుక్రవారాల్లో డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో ఎంఆర్‌డీ బిల్డింగ్‌లోని రూం నంబర్ 507 వద్ద, బుధ, శనివారాల్లో డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ఓపీ బ్లాకులోని రూమ్ నంబర్ 125 వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈసీజీ, 2డీ ఈకో, ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే వారు తమ ఆధారు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 99896 76293 నంబర్‌లో సంప్రదించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు.

నాగార్జున హోమ్స్‌లో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్‌లో రూ.12లక్షల అంచనా వ్యయంతో చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసే ఆటపరికరాల గురించి కాలనీ వాసులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నారులు మానసిక, శారీరకంగా దృఢంగా ఉండేందుకు ఆటలే కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి, కాలనీ వాసులు వెంకటరత్న కుమార్, రాంబాబు రాజు, డిఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మల్లురవి ప్రచారం

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలో ఈ నెల 8 (రేపు) జరిగే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సభను విజయవంతం చేయాలని శనివారం ఓయూలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లురవి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ, టీఎస్‌పీఎస్సీ పేపర్స్ లీకేజీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే యువ సంఘర్షణ సభకు అధిక సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేంద్రం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీయజ్, భూపతిరెడ్డి, చనగాని దయకర్‌గౌడ్, చరణ్‌కౌశిక్‌యాదవ్, బాలలక్ష్మీ, గడ్డం శ్రీనివాస్, పాల్గొన్నారు.

మాయావతి సభను జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: సరూర్‌నగర్ స్టేడియంలో నేడు(శనివారం) జరిగే బీఎస్‌పీ అధినేత్రి మాయావతి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పేద ప్రజల దుఃఖాన్ని చూసి రాష్ట్రంలో తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్యాయానికి గురైన ప్రజలు, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో అన్యాయానికి గురైన నిరుద్యోగులకు భరోసా ఇవ్వాలడానికి యూపీ మాజీ సీఎం మాయావతి సభలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. ఓయూ నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంజయ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించండి

సనత్‌నగర్: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట లాల్‌బంగ్లా రోడ్డులో ఏపీఎస్ వెల్‌నెస్ హాస్పిటల్‌లో ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బందికి రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి నిబంధలను ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం ముఖ్యమని జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్‌లో సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సురేష్, బేగంపేట టీటీఐ ఎస్ఐ జ్యోతి, చక్రధర్, చిరంజీవి, నరేందర్, హాస్పిటల్ ఎండీ అసద్, వివేక్, సుమన్, కార్తీక్ పాల్గొన్నారు.



నాడు ముళ్లపొదలు.. నేడు ఆధునిక హంగులు

- ప్రారంభానికి సిద్ధమైన ధనియాలగుట్ట శ్మశానవాటిక
- ఈ నెల 9న ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, తలసాని


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: కనీవినీ ఎరుగని రీతిలో రూపుదిద్దుకున్న ధనియాలగుట్ట శ్మశానవాటిక ప్రారంభోత్సవం ముహూర్తం ఖరారైంది. ఈ నెల 9న మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించనున్నారు. శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాట్ల పనులను పర్యవేక్షించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి మహానగరంలోనే అత్యంత సుందరంగా బేగంపేట శ్మశానవాటికను నిర్మించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. బేగంపేట నివాసితుల దశాబ్దాల కల నెరవేరబోతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతోనే ఇది సాధ్యపడిందన్నారు. ఎంతోమంది పాలకులు చేయలేని పనులను కేవలం తొమ్మిదేళ్లలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారన్నారు. ఎమ్మెల్యే వెంట బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఆరడుగుల జాగా కోసం..

ఆరడుగుల జాగా కోసం బేగంపేట నివాసితులు తొక్కని గడపా లేదూ..విజ్ఞప్తులు అందుకున్న ప్రజాప్రతినిధీ లేరూ. ఐదు దశాబ్దాలుగా దహన సంస్కారాలకు ఇక్కడి వారు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కృష్ణారావు ఇక్కడి వారి న్యాయమైన పోరాటంపై స్పందించి తాను సైతం కదం తొక్కారు. అప్పటివరకు శ్మశానవాటికకు నిర్దిష్టమైన స్థలమంటూ లేదు. ప్రభుత్వాలను సైతం శాసించే ఓ బడా స్కూల్ యాజమాన్యం గుప్పిట్లో ఉన్న ఆ స్థలంలో దహన సంస్కారాలు చేయాలంటే జంకే పరిస్థితులు ఉండేవి. అలాంటి పరిస్థితులను సైతం ఢీకొట్టి కేసులను సైతం లెక్కచేయకుండా మూడున్నర ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించి రూ. 7.50 కోట్లతో వైకుంఠధామం నిర్మించడంలో ఎమ్మెల్యే సఫలీకృతులయ్యారు.

సకల సౌకర్యాలతో..

విశాలమైన రోడ్లు, నాలుగు దహన వాటికలు, పూజ, పిండ ప్రదానం హాల్, కట్టెలు నిల్వ, అస్థికలు భద్రపరిచే, స్నానాల గదులు వంటి వసతులతో పా టు మంచినీటి సంప్, ఎలక్ట్రికల్, టాయిలెట్స్ వంటి సర్వత్రా సౌకర్యాలు కల్పించారు. ఇక్కడి నిర్మాణాలు ఆధునిక శైలిలో నిర్మితమై కనువిందు చేస్తున్నాయి. మధ్యలో అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకుంది. ఇక ధ్యానముద్రలో ఉన్న పరమశివుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శ్మశానవాటికలోని రోడ్ల వెంబడి, చుట్టూ గ్రీనరీని ఏర్పాటు చేశారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, భగత్‌సింగ్, వడ్డెరబస్తీ వంటి దాదాపు 20 బస్తీలకు ఈ శ్మశానవాటిక అందుబాటులోకి రానుంది. .

కమ్యూనిటీహాళ్లు నిర్మించండి

- 12ఏళ్ల క్రితం నిర్మాణానికి శంకుస్థాపన
- ఇప్పటి వరకు పనులు చేపట్టని వైనం




శ్రీతులసినగర్‌లో కమ్యూనిటి హాలు నిర్మాణం కోసం నాటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఆల్విన్‌కాలనీ: ప్రజలకిచ్చిన హామీలను ప్రజాప్రతినిధులు శిలాఫలకాలకే పరిమితం చేస్తున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీతులసీనగర్, తులసీనగర్‌లలో కమ్యూనిటీ భవనాలు లేవు. సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులు సంక్షేమ సంఘం భవనం ఉండాలని నాటి ఎమ్మెల్యేని కోరారు. అప్పుడు కమ్యూనిటీ భవనానికి 2011లో శంకుస్థాపన చేశారు. కానీ నాటి నుంచి నేటి వరకు కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టలేదు. భవనానికి కేటాయించిన సొమ్ము ఏమైపోయిందో కూడా తెలియని పరిస్థితి. కమ్యూనిటీ భవనం కోసం వెచ్చించిన స్థలాలు సైతం కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం సైతం కాలనీలోని ప్రధాన రహదారిలో తాత్కాలిక గుడారాన్ని ఏర్పాటు చేసుకొని నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భూవివాద సమస్యలను పరిష్కరించండి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భూ వివాదాలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని శనివారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలనా కమిషనర్ నవీన్ మిట్టల్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ... కూకట్‌పల్లి డివిజన్‌లోని పాపిరెడ్డినగర్‌లో 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునే వారు అధిక మొత్తం చెల్లించాల్సిందిగా రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. పక్కనే ఉన్న ఏ బ్లాక్ కన్నా బీ, సీ బ్లాక్ వాసులు అధిక మొత్తంలో చెల్లించాల్సి రావటంతో ఆ వ్యత్యాసాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

◆ అదే విధంగా హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్‌నగర్ కాలనీవాసులకు రిజిస్ట్రేషన్ శాఖ తెలుపుతున్న అభ్యంతరాలను పరిష్కరించాలని విన్నవించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో యూఎల్‌సీ ద్వారా డబ్బులు చెల్లించినా వారి స్థలాలను క్రమబద్ధీకరించకపోవడం లాంటి పలు సమస్యలను జీఓ 58, 59ల ద్వారా దరఖాస్తులు చేసుకున్న పేదవారి ఆస్తుల క్రమబద్ధీకరణను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన 2 ఎకరాల స్థలంలో భవన నిర్మాణానికి రూ.9కోట్ల నిధుల మంజూరుకు సహకరించాలన్నారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన నవీన్ మిట్టల్ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

'ఉదాసీన్ మఠం మరో పర్యాటక కేంద్రంగా మారనుంది'

కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు


రఘు మునీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: శ్రీపంచాయతీ అఖాడ ఉదాసీన్ మఠం చైర్మన్ రఘు మునీజీ, శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిని శనివారం కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కలిశారు. ఈ సందర్భంగా వారి ఆశీస్సులు తీసుకున్నారు. హైదరాబాద్ నడిబొడ్డును ఉన్న ఉదాసీన్ మఠం భూముల్లో వందలాది నెమళ్లు సంచరిస్తూ అటవీ వాతావరణాన్ని తలపిస్తోందన్నారు. రామాయణంలోని పర్ణశాలను తలపించేలా చేపట్టిన ఏర్పాట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయన్నారు. ప్రతిరోజు 10 వేల మందికి అన్నప్రసాద వితరణ, సత్రాలు,యాగ శాలలు, ఉచిత వైద్య కేంద్రాలు వంటి నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. అనాథ పిల్లల కోసం ఆశ్రమం కూడా నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. పూర్తిస్థాయిలో దైవిక సమాజిక సేవా కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువచ్చి ఈ మఠం మరో పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు హరిబాబు, వినోద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.బాలస్వామి సేవలు మరువలేనివి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జర్నలిజం విభాగం దివంగత అధ్యాపకులు ప్రొ.బాలస్వామి చిత్రపటానికి తుంగతుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ నివాళి అర్పించారు. శనివారం ఓయూలో హెచ్‌సీడీసీలో జరిగిన ప్రొ.బాలస్వామి 2వ స్మారక ఉపన్యాసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిశోర్ మాట్లాడుతూ ప్రొ.బాలస్వామి తనకు పీహెచ్‌డీ గైడ్ అని ఇక్కడి విద్యార్థులకు ఓయూకు బాలస్వామి చేసిన సేవలు మరువలేమన్నారు. కార్యక్రమంలో హెడ్ స్టీవెన్‌సన్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు పడాల సతీష్, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం


అల్లాపూర్ సర్వే నం.18లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సర్వే నం.18లో స్థలాన్ని శనివారం కార్పొరేటర్ సబిహా బేగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో, రెవెన్యూ డిపార్టుమెంట్ అధికారులతో ఈ ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గోవర్ధన్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ మల్లేశ్వరరావు, వినాయకరావు, ఎస్ఆర్‌పీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

బాలానగర్: ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడం గొప్ప విషయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బాలానగర్‌లోని చిత్తారమ్మ బస్తీ ఆవరణలో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేస్తుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లు, కుట్టు మెషిన్లను అందజేశారు. ఖార్డు స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఏఎండీ డైరెక్టర్ అనిల్‌కుమార్, గోపాల్‌కృష్ణ, ఖార్డ్ సంస్థ సభ్యులు సుమన్ దంపతులు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శాఖయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్ తోటలో శిక్షణ శిబిరం ప్రారంభం

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, కంప్యూర్ ట్రెనింగ్ సెంటర్‌ను మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు ప్రతి డివిజన్‌లో సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, సత్యం, ఉదయ్, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ'సర్వే' మాయ!

- వాస్తవ పరిస్థితికి భిన్నంగా నివేదికలు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం
- తప్పుల తడకగా ల్యాండ్ సర్వే విభాగం నివేదికలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: భూ సర్వే సిబ్బంది మాయాజాలంతో విలువైన భూముల లెక్కలు తారుమారు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఒక ప్రాంతంలోని ఒక స్థలాన్ని వేర్వేరుగా ఇద్దరు సిబ్బంది సర్వే చేసి భూకొలతలపై భిన్నంగా నివేదికలు అందజేయడం అనుమానాలకు తావిస్తోంది. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా, మరి కొందరికి నష్టం కలిగించేలా చేతివాటం ప్రదర్శించడం ఆందోళన గురిచేస్తోంది. భూసర్వే కొలతల అక్రమాలపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తున్నా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరు నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న చందంగా తయారైంది. భూసర్వే కొలతల వ్యవహారంలో భారీగా చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఒక అధికారి నిర్లక్ష్యం, అసమర్థత కారణంగానే భూసర్వే వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ వివాదాస్పద భూములకు సైతం క్లీన్ చీట్ ఇవ్వడం.. మరోవైపు కొలతల రిపోర్టునకు భారీగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

◆ అల్వాల్ మండలంలోని యాప్రాల్ ప్రాంతంలో 198 సర్వే నంబరులో 2015లో ఒకసారి, 2017లో మరోసారి భూసర్వే చేసినా అప్పటి మండల సర్వే సిబ్బంది 10 గుంటల స్థలం ఉందని పేర్కొంటూ సర్వే నివేదిక అందజేశారు. అదే స్థలాన్ని తాజాగా 2023 మార్చిలో 30 గుంటల స్థలంగా పేర్కొంటూ కొలతల నివేదిక సమర్పించడం అనుమానాలు కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.

◆ దుండిగల్ రూరల్ పరిధిలోని గాగిలాపూర్ 214 సర్వే నంబర్ సంగారెడ్డి– మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉంటుంది. ఇక్కడ రెండు ఎకరాల స్థలాన్ని తప్పుడు కొలతలతో ఏకంగా హద్దులు మార్చివేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కుదిరిన ఒప్పందంలో భాగంగా కొంత మాత్రమే ముట్టడంతో నివేదిక సమర్పించడంలో కాలయాపన సాగుతున్నట్లు తెలుస్తోంది.

◆ ఉప్పల్ మాజీ ప్రజాప్రతినిధి నాగోల్ విలేజి సమీపంలో సర్వే నంబర్ 124లోని ఓ ప్లాట్ విషయంలో నివేదిక ఇవ్వాలని భూసర్వే ల్యాండ్ విభాగంలో సంప్రదించగా, భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రూ.2 లక్షలు ముట్టజెప్పినా.. మరింత ఇస్తేనే లైన్ క్లియర్ చేస్తానని చెప్పడంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

◆ దుండిగల్ మండలంలోని సాయినాథ్ సొసైటీలో స్థలాల వివాదం కోర్టులో ఉన్నప్పటికీ కొన్ని స్థలాలకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.

చెట్టులోనే స్తంభం.. స్పందించని అధికార గణం





విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డొస్తే విద్యుత్ శాఖ అధికారులు వాటిని తొలగిస్తారు. కానీ ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్‌లోని శివసేన గ్రౌండ్ వెనకాల విద్యుత్ స్తంభం చెట్టులోనే కలిసిపోయింది. అది ఇనుప స్తంభం కావడంతో షాక్ తగిలే ప్రమాదం ఉంది. పక్కనే ఇల్లు, గ్రౌండ్ ఉండటంతో చిన్నారులు అక్కడే ఆడుకుంటున్నారు. పిల్లలు ఈ స్తంభాన్ని ముట్టుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చెట్టులో ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు. గతంలో ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగితే విద్యుత్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

– మూసాపేట

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి, కాలనీవాసులు వెంకట రత్నకుమార్, రాంబాబు రాజు, డీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.


నాగార్జున హోమ్స్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


ఎల్లమ్మ చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను శనివారం ఎంటమాలజీ సిబ్బంది తొలగించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంటి పరిసరాల్లోని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల బెడద ఉండదన్నారు. ప్రజలు సైతం నాలాలు, చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను, కవర్లను వేయవద్దని కోరారు. ఏ రోజుకారోజు చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బంది, నాయకులు వెంకట్‌నాయక్, పోశెట్టి గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత...

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ధరణినగర్ నివాసి లక్ష్మణశాస్త్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్, వాసుదేవరావు, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పబ్లిక్ కాంటాక్ట్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇంద్రాహిల్స్, ఆదర్శ్‌నగర్, సాయిచరణ్‌కాలనీ, పీవీఆర్ సాయిహిల్స్‌లో శనివారం పబ్లిక్ కాంటాక్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ స్థానికులతో కలిసి కాలనీ, బస్తీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి పబ్లిక్ కాంటాక్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.